క్లుప్తంగా

శ్రావణ మాస పూజలు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబుల దిన్నె గ్రామంలో వెలసిన అభయాంజనేయ స్వామికి మంగళవారం శ్రావణ మాసం పూజలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి పంచామృతాభిషేకం, కుంకుమ, సింధూర అర్చనలు, ఆకు పూజలు చేపట్టారు. అనంతరం అర్చకులు లక్ష్మణస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అంతర పంటలతో లాభదాయకం

ఉయ్యాలవాడ : ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసే ప్రధాన పంటల్లో అంతర్ పంటలు సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులురెడ్డి సూచించారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆర్.పాంపల్లె, కొండుపల్లె గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. అంతర్ పంటల్లో భాగంగా చిరు ధాన్యాలను ఎంపిక చేసుకుని పంటలు సాగు చేస్తే తక్కువ కాలంలో అధిక దిగుబడులు పొందవచ్చునని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సునీత, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మినుములో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

చాగలమర్రి: మినుము పంట సాగు చేసిన రైతులు పొలంలో వర్షం నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, లేకపోతే అధిక తేమ శాతం వల్ల బూడిద తెగులు వచ్చే ప్రమాదముందని చాగలమర్రి ఏఓ రంగనేతాజి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని డి.వనిపెంట, చెంచుగూడెం, గోడిగనూరు గ్రామాల్లో పోలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. మొక్కజొన్న, మినుము పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. పంట బీమాకు ఈ నెల 14వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు.

మద్యం పట్టివేత

శిరివెళ్ల: చెన్నూరులో మంగళవారం 18 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ చిన్న పీరయ్య తెలిపారు. గ్రామానికి చెందిన దాసరి చలమయ్య తన ఇంటి వద్ద మద్యం అమ్ముతుండగా దాడి చేశామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

2,316 పక్కా గృహాలు మంజూరు

చాగలమర్రి: మండలానికి 2,316 పక్కా గృహాలు మంజూరైనట్లు మండల హౌసింగ్ ఏఈ నవీన్ తెలిపారు. వీటిలో ఇప్పటికే 850 గృహాల నిర్మాణాలు పూర్తి అయ్యాయన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా చాగలమర్రి హౌసింగ్ ఏఈగా వచ్చిన నవీన్ మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

శక్తియాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి


మాట్లాడుతున్న ఏఎస్పీ మంద జావళి ఆల్ఫోన్స్

నంద్యాల(న్యూటౌన్): ఆత్మరక్షణ కోసం మహిళలతో పాటు విద్యార్థినులు తమ సెల్‌ఫోన్లలో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని నంద్యాల ఏఎస్పీ మంద జావళి ఆల్ఫోన్స్ సూచించారు. మంగళవారం పట్టణంలోని నేషనల్ డిగ్రీ కళాశాలలో సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాంను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నేషనల్ డిగ్రీ కళాశాల చైర్మన్ డాక్టర్ ఇంతియాజ్ అహమ్మద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మాయిలకు జీవితంలో ఏదైనా సాధించాలంటే ఆసక్తి ఉండాలన్నారు. మహిళల భద్రత కోసం శక్తి యాప్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జయరాములు, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, మహిళా పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కిష్టిపాడులో నీట మునిగిన గ్రామ నీటిసరఫరా మోటార్ గది, దొర్నిపాడులో కుందూనది ఉధృతికి మునిగిపోయిన వంతెన

పోటెత్తిన కుందూ

దొర్నిపాడు/గోస్పాడు: భారీ వర్షాలకు కుందూనది ఉప్పొంగింది. శ్రీశైలం జలాశయం నుంచి నదికి భారీగా నీరు విడుదల చేయడంతోపాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలతో దిగువకు వరద నీటి ప్రవాహం పెరిగింది. దీంతో కుందూ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. నది ఉప్పొంగడంతో పలు ప్రాంతాల్లో వంతెనలపై మోకాళ్లలోతు మేర వరదనీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్తంభించాయి. క్రిష్టిపాడు గ్రామంలో కుందూపై నిర్మించిన బ్రిడ్జి నీట మునిగింది. ఈ గ్రామంలో తాగు నీటి సరఫరా చేస్తున్న మోటార్ గది సైతం నీట మునగడంతో నీటి సరఫరాకు ఆటంకంగా మారింది. గోస్పాడు మండలంలో రాయపాడు, తేళ్లపురి, ఎస్.


గోస్పాడులో ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ

కూలూరు గ్రామాల సమీపంలో ఉన్న పంట పొలాలను నీరు ముంచెత్తింది. ఆయా గ్రామాల్లోకి వరద నీరు ఎక్కడ వస్తుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉంటే కుందూనీటికి వరద నీరు ఇంకా పెరిగే అవకాశం ఉందని పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారులు చాటింపు వేయించారు.


కూలూరు వద్ద నీటమునిగిన పంటపొలాలు

ఇండియా కూటమి నేతల అరెస్ట్ అప్రజాస్వామికం


మాట్లాడుతున్న చింతలమోహన్‌రావు

నంద్యాల(అర్బన్): ఎన్నికల కమిషన్ చేసిన తప్పులపై గళమెత్తిన ఇండియా కూటమి నేతలను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతలమోహన్‌రావు విమర్శించారు. అరెస్ట్‌ను నిరసిస్తూ మంగళవారం స్థానిక బొమ్మలసత్రం వద్ద ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలమోహన్‌రావు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ తప్పులను ఎత్తిచూపే వారిపై బీజేపీ ఈడీ, సీబీఐను ప్రయోగిస్తుందన్నారు. రామరాజ్యమంటే దొంగ ఓట్లతో దొడ్డిదారిన అధికారంలోకి రావడమేనా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి యావత్ దేశం అండగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, రవిబాబు, చాబోలు సలాం, ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

యువతే దేశానికి శ్రీ రామరక్ష


మీఆరోగ్యం..మీ బాధ్యత పోస్టర్ల ఆవిష్కరణలో అధికారులు

శిరివెళ్ల: యువతే దేశానికి శ్రీ రామరక్షని నంద్యాల మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యువజన దినోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా ఆగస్టు 12వ తేదీన ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించిందన్నారు. యువకులు విద్యతో పాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఉన్నత చదువులు చదివి దేశానికి మంచి పేరు తేవాలన్నారు. హెపటైటిస్‌కు నంద్యాలలో ఉత్తమ చికిత్స ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు నులి పురుగు నివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇంద్రాణి, ఆళ్లగడ్డ చైతన్య రూరల్ సొసైటీ మేనేజర్ వర్ధనాచారి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాసరావు, యర్రగుంట్ల మెడికల్ ఆఫీసర్ ఆష్రష్ ఆలీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు


డీలర్లతో సమావేశం నిర్వహిస్తున్న ఏడీఏ

నంద్యాల(న్యూటౌన్): ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని ఆళ్లగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకులు విజయశేఖర్ హెచ్చరించారు. మండల కేంద్రమైన గోస్పాడులో స్థానిక వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి ఆధ్వర్యంలో ఎరువు, పురుగు మందుల డీలర్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగు సీజన్ కావడంతో డీలర్లు మందులను రైతులకు సక్రమంగా అందించాలన్నారు. యూరియా, ఇతర ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతులు లేని ఎరువు, పురుగు మందులు విక్రయించరాదన్నారు. మందులు తీసుకున్న ప్రతి రైతుకు బిల్లు వేసి ఇవ్వాలని సూచించారు. స్టాక్ నిల్వలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు తమ దృష్టి వస్తే సంబంధిత డీలర్లపై చర్యలు తప్పవన్నారు.

గోస్పాడు: మినుము పైరు సాగు చేసిన రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆళ్లగడ్డ ఏడీఏ విజయశేఖర్ అన్నారు. మంగళవారం గోస్పాడులో పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పొలాల్లో వర్షపునీరు వచ్చే అవకాశం ఉందన్నారు. మినుము పైరులో రైతులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం మినుము పైరులో అనుసరించాల్సిన విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటలో 20కిలోల పొటాష్ ఎరువులు వేయాలి

నంద్యాల(అర్బన్): పూత దశలో ఉన్న మొక్కజొన్న పైరుకు ఎకరాకు 20 కిలోల పొటాష్ ఎరువు వేయాలని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. దీని ద్వారా కంకిలో గింజలు బాగా కడుతాయని సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పాండురంగాపురం, చాపిరేవుల గ్రామాల్లో రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు.

ఉచిత ప్రయాణానికి ఏర్పాట్లు పూర్తి

నంద్యాల(వ్యవసాయం): ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూలనాగరాజు పేర్కొన్నారు. మంగళవారం ఆయన నంద్యాల ఆర్టీసీ డిపోను సందర్శించారు. అక్కడ పని చేస్తున్న కార్మికులు, ప్రయాణికులతో మాట్లాడారు. స్త్రీశక్తి ప్రయాణికుల రద్దీకి తగ్గట్లుగా బసులు నడుపుతామన్నారు. నంద్యాల డిపోలో 493 బస్సులు ఉన్నాయని, వాటిలో 378 బస్సులు పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయన్నారు. ఈ పథకం ద్వారా మహిళలు పిల్లలు, ట్రాన్స్‌జెండర్లు రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పారు. అనంతరం ఆర్టీసీ గ్యారేజీని, డిస్పెన్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఎం రజియాసుల్తానా, డిపో అసిస్టెంట్ మేనేజర్ కిశోర్, ఇన్‌చార్జ్ డిపో మేనేజర్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులకు యూరియా అందించండి

రుద్రవరం: రాయితీ ధరకు రైతులకు యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు మంగళవారం మండల వ్యవసాయాధికారి సుమతిని కలిసి కోరారు. వరి సాగు చేస్తున్న రైతులకు యూరియా పెద్ద సమస్యగా మారిందని, బయట బ్లాక్‌లో విక్రయిస్తున్నారని చెప్పారు. రైతు సేవా కేంద్రాలు, సొసైటీల ద్వారా యూరియా అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు రామచంద్రుడు, నాయకులు గుర్రెడ్డి, నరేష్, రైతులు నరసింహారెడ్డి, నారాయణ, షరీఫ్ తదితరులు ఉన్నారు.

బంగారు ఆభరణాలు మాయం

దొర్నిపాడు: ఇంట్లో ఎక్కడైనా దాచమని ఇచ్చిన సొత్తులు మాయమయ్యాయి. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. పాణ్యం మండలం గోనవారం గ్రామానికి చెందిన రేష్మ తన భర్త మహమ్మద్ యూనస్‌తో కలిసి దొర్నిపాడు మండలం డబ్ల్యూ గోవిందిన్నెలో జరిగే పెద్దమ్మ దేవరను చూసేందుకు తాతయ్య జబ్బార్ ఇంటికి వచ్చింది. ఆలయానికి వెళ్లేప్పుడు ధరించ వచ్చిని తన వద్ద నున్న నాలుగు తులాల బంగారు, 35 తులాల వెండి ఆభరణాలను తాతయ్యకు దాచమని ఇచ్చింది. మరుసటి దినం తన సొత్తులు ఇవ్వాలని కోరగా బీరువా తెరిచి చూసేసరికి ఆభరణాలు కనిపించలేదు. ఎలా మాయం అయ్యాయని ఒకరిపై ఒకరూ చెప్పుకోవడం మొదలు పెట్టారు. అప్పట్లో ఈ పంచాయతీ స్టేషన్‌కు చేరినా ఫలితం లేదు. దీంతో రేష్మ భర్త మహమ్మద్ యూనస్ ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జీ ఎస్‌ఐ రామిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మంగళవారం తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శిరివెళ్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాములపాడు మండలం ఎర్రగూడూరుకు చెందిన బుడగ జంగాల చలమయ్య (72) కోలుకోలేక మృతి చెందాడు. ఎస్‌ఐ చిన్న పీరయ్య తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 8వ తేదీన మృతుడు శిరివెళ్ల మెట్ట వద్దనున్న తన కూతురు అలివేలమ్మను చూడడానికి స్వగ్రామం నుంచి మోటార్ బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యంలో ఆటో వేగంగా వచ్చి ఢీకొనింది. ఈ ఘటనలో తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతు మృతి చెందాడు. ఈ మేరకు కూతురు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

మునిగిన మినుము రైతు



డబ్ల్యూ గోవిందిన్నెలో బురదలో కోతలకు అవస్థలు, పొలంలోనే రాలిపోతున్న మినుము కాయలు

దొర్నిపాడు: చాలా మంది రైతులు గత కొన్నేళ్ల నుంచి ఖరీఫ్ పంటల్లో భాగంగా తొలి పంటగా మినుము సాగుచేస్తున్నారు. కేవలం మూడు నెలల పంటే కావడంతో రెండు దఫాలు వర్షాలు కురిసినా పంట చేతికి వస్తుందనే ఆశతో ఈ పంటను సుమారు 700 హెక్టార్లకు పైగా సాగుచేశారు. కానీ పంట చేతికి వచ్చేసరికి వరుసపెట్టి భారీ వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతకు అనుకూలించక, గింజలన్నీ నేల రాలడం, మొద్దులకే కాయలన్నీ అంటుకొని ఉండటంతో దిగుబడులు రాక కంగారు పడుతున్నారు. అలాగే మిషన్లు బురదలో కోతకోయాలంటే ఆటంకంగా మారింది. మొదటి పంటే చేతికిరాకపోవడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. కొందరు కూలీల ఖర్చులైనా మిగులుతాయని చేనులోనే పంటను వదిలేస్తున్నారు. ప్రభుత్వం పంటనష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని మినుము రైతులు కోరుతున్నారు.

యువత చెడు ఆలోచనలను వీడాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

గోస్పాడు: యువత చెడు ఆలోచనలు వీడి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకట రమణ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఎయిడ్స్ నియంత్రణ-నివారణా విభాగం నంద్యాల ఆధ్వర్యంలో మంగళవారం హెచ్ఐవీ, డ్రగ్స్ పట్ల యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ దేశ భవిష్యతు యువత మీద ఆధారపడి ఉంటుందని, అలాంటి యువత ఉన్నతమైన ఆలోచనలు, జీవన నైపుణ్యాలు కలిగి ఉండాలన్నారు. క్షణిక అవేశంలో నిర్ణయాలు తీసుకురాదన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ శారదాబాయి మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థినీ విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం యూత్ ఫెస్ట్ – 2025 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలీ హైదర్, డీసీహెచ్ఎస్ డాక్టర్ లలిత, గణాంక అధికారి దేవి శంకర్ గౌడ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్లు నాగేంద్ర, షేక్ షావలీ, విజయ మహిళా మండలి సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకట సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం ముఖ్యం

- నులిపురుగుల నివారణ కార్యక్రమంలో మంత్రి ఫరూక్


విద్యార్థులకు మాత్రలు వేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటం చాలా ముఖ్యమని, దేశ భవిష్యత్తు వారిపైనే ఆధారపడి ఉందని మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా నంద్యాల ఖాదరబాద్ నర్సింగరావు మున్సిపల్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన ఆరోగ్య పథకాలు సక్రమంగా అమలు చేసే బాధ్యత వైద్య ఆరోగ్య శాఖపై ఉందన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మిగించడం జరుగుతుందని, ఈ కార్యక్రమం ఈనెల 20వ తేదీ వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మానిటరింగ్ అధికారి డాక్టర్ దేవసాగర్, కమిషనర్ శేషన్న, మానిటరింగ్ అధికారి సుబ్రమ్మణ్యం, డాక్టర్ కాంతరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుద్రవరం: ఆల్బెండజోల్ మాత్రలతోనే బాల,బాలికల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని నర్సాపురం, ఆలమూరు పీహెచ్‌సీల వైద్యులు బాబు,అమర్నాథరెడ్డి అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మంగళ వారం ఆయా పీహెచ్‌సీల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు,పాఠశాలల్లో 1నుంచి 19 ఏళ్లలోపు ఉన్న బాల బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలను మిం గించారు.

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ని 2095 మంది విద్యార్థులకు నులి పురగుల నివారణ మందు వేసినట్లు వైద్యాధికారి వుశేన్ తెలిపారు.వందశాతం విద్యార్థులకు మందులు వేశామని నులి పురుగుల ప ట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి జ్యోతి, ఎంపీహెచ్ఈఓ బాబయ్య తదితరులు ఉన్నారు.

శిరివెళ్ల: మండలంలో 5,791 మంది విద్యార్థులకు గాను 5,682 మందికి నులి పురుగు నివారణ మందులు వేసినట్లు ప్రభుత్వ వైద్యాధికారి ముఖేష్ కుమార్, సీహెచ్‌ఓ రాంమోహన్‌రెడ్డి తెలిపారు.

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శైలజారాణి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ రాజకుమారి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: పాఠశాల విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు, మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, గిరిజన సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో జిల్లాస్థాయి స్కూలింగ్, బిల్డింగ్ బ్లాకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ మనదేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల జాబితాల్లో చేర్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. జిల్లాలోని ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి వారికి ఉన్నతస్థితికి దోహదపడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో 100 శాతం మార్కులు సాధించే విధంగా తీర్చిదిద్దాలన్నారు.చదువులో వెనుకబడిన వారిని గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. అలాగే చెడు అలవాట్లకు బానిసలు కాకుండా ఉపాధ్యాయులు చూడాలన్నారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ మహిళలపై దాడులు ఆపకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం

నంద్యాల(అర్బన్): రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీ మహిళలపై దాడులను ఆపకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూనిస్ హెచ్చరించారు. పట్టణంలోని స్థానిక కార్యాలయంలో మంగళవారం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనంతపురం జిల్లాలోని సాయినగర్ అశ్ర ఆప్టికల్స్‌లో బీభత్సం సృష్టించి ముస్లిం మహిళపై దాడికి పాల్పడిన టీడీపీ ఎమ్మెల్యే ప్రసాద్ అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మైనార్టీల హక్కులను కాపాడుతామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు దాడులకు తెగబడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సయ్యద్‌గులాబ్, ఇక్బాల్ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరిస్తున్న సర్కారు


ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తుందని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ రంగరాజు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య 90వ వార్షికోత్సవం నిర్వహించారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి సభ జరిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రతాప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి దినేష్ రంగరాజు జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో హిందీ ప్రథమ భాష నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో మెడికల్ విద్య పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు అందకుండా ఈ ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. తక్షణమే జీవో నం.107, 77 రద్దు చేసి, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, సాంఘిక సంక్షేమ హాస్టళ్లను నూతన భవనం నిర్మించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లోకి ఆర్గనైజేషన్లు వెళ్లకూడదని తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో విద్యాశాఖ మంత్రి లోకేష్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రంగనాయుడు, బాబాఫకృద్దీన్, ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి మురళీ, బెనహర్, పులికొండన్న, భార్గవ్, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, ఉదయ్, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా హెచ్ఐవీ పరీక్షలు

నంద్యాల(అర్బన్): అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెచ్ఐవీ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారని, పరీక్షలు చేయించుకున్న వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని డాక్టర్ శకుంతలబాయి తెలిపారు. నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో హెచ్ఐవీ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఆర్టీసీ సిబ్బంది ఆందోళన

నంద్యాల(వ్యవసాయం): పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎంయూఏ నాయకులు, ఆర్టీసీ సిబ్బంది మంగళవారం డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు సుబ్బరాజు, యోగారెడ్డి మాట్లాడుతూ వెంటనే పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, వేతన సవరణ అయిపోయి రెండు సంవత్సరాలు పూర్తయినందున ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే చెల్లించాలన్నారు. రిటైర్డు ఉద్యోగులకు గ్రాట్యుటీ, ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లింపులు తక్షణమే చేయాలన్నారు. ఆర్టీసీలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, మల్లారెడ్డి, నందీశ్వరుడు, నరసింహులు, సుబ్బారావు, పద్మావతి, భాగ్యలక్ష్మి, సుమతి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల ప్రత్యేక సమావేశం

శిరివెళ్ల: ఈ నెల 13వ తేదీన మండల ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసశర్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి, గ్రామ అభివృద్ధి సూచికలపై చర్చ జరుగుతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు విధిగా సమావేశానికి హాజరు కావాలన్నారు.